RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా



వరంగల్ | సంపుటి 2 | సంచిక 89 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | బుధవారం | 30.09.2026 | పేజీలు : 8

ఆసియా క్రీడల్లో నీరూ ధండా చారిత్రక స్వర్ణం..
అభినందించిన ప్రధాని మోదీ

- ఆసియా క్రీడల ట్రాప్ షూటింగ్‌లో చరిత్ర సృష్టించిన నీరూ ధండా
- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు



2

- మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు రజత పతకం
- విజేతలను అభినందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్

బుల్లెట్ ట్రైన్ పేరుతో
రియల్ ఎస్టేట్ దందా : కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

- బుల్లెట్ ట్రైన్ భూసేకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్న కేటీఆర్
- బహదూర్‌పల్లి రైతుల వ్యవసాయ భూములను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రభుత్వ భూమి ఉండగా రైతుల భూములు ఎందుకని ప్రశ్న



2

దసరా వేళ పాలపిట్టలను బంధిస్తే
కఠిన చర్యలు.. అటవీశాఖ హెచ్చరిక



2

సైబర్ మోసాల్లో కొత్త కోణం..
ఉన్నత విద్యావంతులే టార్గెట్..!

- సైబర్ మోసాల బారిన పడుతున్న ఉన్నత విద్యావంతులు
- బాధితుల్లో ఐటీ నిపుణులు, డాక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు
- ఐఐటీ మద్రాస్ అధ్యయనంలో వెల్లడైన కీలక వాస్తవాలు
- మానసిక ఒత్తిడిలో ఉన్నవారినే లక్ష్యంగా చేసుకుంటున్న కేటుగాళ్లు




నిత్యం నిఘా, హైదరాబాద్ : సైబర్ ఆర్థిక మోసాల బారిన కేవలం నిరక్షరాస్యులు, అవగాహన లేని వారు మాత్రమే పడతారనే అపోహను ఐఐటీ మద్రాస్ తాజా అధ్యయనం పటాపంచలు చేసింది. ఉన్నత విద్యావంతులు, డిజిటల్ పరిజ్ఞానం కలిగిన ఉద్యోగులు సైతం పెద్ద సంఖ్యలో ఈ మోసాలకు గురవుతున్నారని ఈ పరిశోధన స్పష్టం చేసింది. కేవలం డిజిటల్ అక్షరాస్యత కలిగి ఉండటం ఒక్కటే సైబర్ నేరాల నుంచి పూర్తి రక్షణ కల్పించ లేదని ఈ నివేదిక తేల్చి చెప్పింది. ఐఐటీ మద్రాస్‌కు చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి, ప్రొఫెసర్ పి. కందస్వామి, ప్రొఫెసర్ నందన్ సుదర్శనం నేతృత్వంలో ఈ అధ్యయనం సాగింది. ఇందుకోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లోని బాధితులపై సర్వే నిర్వహించారు. బాధితుల్లో ఐటీ నిపుణులు, బ్యాంకు ఉద్యోగులు, వైద్యులు, ఆర్థిక రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో పాటు సైబర్ సెక్యూరిటీ ధ్రువీకరణ పత్రాలు కలిగిన వారు సైతం ఉండటం గమనార్హం. సైబర్ నేరగాళ్లు బాధితులను ఎంచుకోవడంలో ప్రత్యేక వ్యూహాలను అనుసరిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా కుటుంబం లో అనారోగ్య సమస్యలు, ఉద్యోగ వేట, పదవీ విరమణ, పని ఒత్తిడి వంటి కారణాలతో మానసిక ఆందోళనకు గురవుతున్న వారిని వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. భయం, ఆత్మన్యూనత వంటి భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని, వారిని మానసికంగా లొంగదీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ మోసాల కారణంగా బాధితులు కేవలం ఆర్థి కంగానే కాక, తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. అవమాన భారంతో కుంగిపోవడం, నిద్రలేమి, డిప్రెషన్, కుటుంబ సభ్యుల నమ్మ కాన్ని కోల్పోవడం వంటి పరిణామాలు వారిని వేధిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు, సైబర్ క్రైమ్ విభాగాలు సత్వరమే స్పందిస్తున్నప్పటికీ, మరికొన్ని విభాగాలు సాంకేతిక సామర్థ్యం లోపం కారణంగా వెనుకబ డుతున్నాయని ఈ అధ్యయనం గుర్తించింది. ఈ నేపథ్యంలో, నివారణ వ్యూహాల ను రూపొందించే టప్పుడు ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణ నలోకి తీసుకోవాలని పరిశోధకులు సూచి స్తున్నారు.

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి వివాదం.. హైకోర్టు కీలక ఆదేశాలు

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు అసభ్యంగా ప్రవర్తించారనడానికి ఆధారాల్లేవన్న హైకోర్టు
- బాధ్యులైన పోలీసులను గుర్తించాలని డీజీపీకి ఆదేశం
- పోలీసులపై చర్యలకు నివేదిక సిద్ధం చేయాలని సూచన
- నివేదికను స్పీకర్ ముందు ఉంచాలని ఆదేశం

నిత్యం నిఘా, హైదరాబాద్ : అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోలీ సుల మధ్య జరిగిన ఘర్షణపై తెలంగాణ హై కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పోలీసులతో అసభ్యం గా ప్రవర్తించారన్న పోలీసుల వాదనకు ఆధా రాలు లేవని స్పష్టం చేసింది. మహిళా ఎమ్మె ల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసుల ను గుర్తించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదే శించింది. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులను గుర్తించి, వారిపై చర్యలు తీసు కునేలా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని హైకోర్టు సూచించింది. ఆ నివేదికను అసెంబ్లీ స్పీకర్ ముందు ఉంచాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు స్పీకర్ ఆదేశాల మేరకే వ్యవహరించి ఉంటే.. వారిపై చర్యలు తీసుకునే అంశం స్పీకర్ పరిధిలోకి వస్తుందని ధర్మాసనం ...

2



అధికారంలో లేకున్నా తగ్గని జోరు..
బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

- ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు పెరిగిన విరాళాలు
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.16.4 కోట్లుగా నమోదు
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన పార్టీ ఫండ్స్
- ఈసీకి సమర్పించిన నివేదికలో వెల్లడించిన బీఆర్ఎస్

2

మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి
- కాంగ్రెస్‌పై ఈటల ఫైర్

- ఓట్ల ట్యాంపరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్
- రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి తొలగించాలని డిమాండ్
- సోనియా గాంధీ ఓటుపై రాహుల్ సమాధానం చెప్పాలన్న అరవింద్



2

అదుపుతప్పి మాట్లాడితే
మహిళలతో కొట్టిస్తా
: కొండా సురేఖ



- నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో కొట్టిస్తానన్న కొండా సురేఖ
- వరంగల్‌లో ప్రతిపక్ష నేతలకు, పార్టీలోని కొందరికి హెచ్చరిక
- ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలని నేతలకు సూచన

2

దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు
- మంత్రి పొన్నం ప్రభాకర్

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



నిత్యం నిఘా, హైదరాబాద్ : రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడు కోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవ తలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభి ప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి వివాదం.. హైకోర్టు కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి.. స్పష్టం చేసింది. అసెంబ్లీ వ్యవహారాల్లో స్పీకర్‌కు ఉన్న అధికారాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తాజాగా సవరించింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా గేటు వద్ద ఈ ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. తాజాగా కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఈ అంశం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది.

అధికారంలో లేకున్నా తగ్గని జోరు.. బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ.16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) పార్టీకి రూ.15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరగడం గమనార్హం. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్, తిరిగి గద్దెనెక్కాలని బీఆర్ఎస్, తొలిసారి పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో బీఆర్ఎస్‌కు నిధులు పెరగడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా మారింది.

అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

- కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు. కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి : కాంగ్రెస్‌పై ఈటల ఫైర్

మొదటిపేజీ తరువాయి.. ఓట్ల ట్యాంపరింగ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ఓట్లను ట్యాంపరింగ్ చేసి ఉంటే లోక్‌సభలో 400 సీట్లు గెలిచేవాళ్లమని, కేవలం 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటామని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని, భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన నవ్వులపాలు చేస్తున్నారని మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈవీఎంలను రాజీవ్ గాంధీ హయాంలోనే ప్రవేశపెట్టారని, వీవీప్యాట్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈటల గుర్తుచేశారు. ఇదే అంశంపై ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఉన్నంతవరకు 'కాంగ్రెస్ ముక్త్ భారత్' సాధ్యమేనని ఎద్దేవా చేశారు. "పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని" ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలవలేకే కాంగ్రెస్ పార్టీ లేనిపోని సమస్యలను సృష్టిస్తోందని అర్వింద్ ఆరోపించారు. దేశాన్ని, హిందువులను కించపరచడమే లక్ష్యంగా రాహుల్ పనిచేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

డేటింగ్ యాప్ మోసం: జూబ్లీహిల్స్ పబ్‌లో యువకుడికి రూ. 29,000 బిల్లు!

డేటింగ్ యాప్‌లో పరిచయమైన యువతితో డేట్‌కు వెళ్లిన యువకుడు

జూబ్లీహిల్స్ పబ్‌లో రూ. 29,000 బిల్లు వేసి వసూలు

పబ్ యాజమాన్యంతో యువతి కుమ్మక్కైందని బాధితుడి ఆరోపణ

బాధితుడు హేమంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌ల ముసుగులో జరుగుతున్న మోసాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన ఓ యువతితో కలిసి డేట్‌కు వెళ్లిన యువకుడు, ఏకంగా రూ. 29,000 బిల్లు చెల్లించాల్సి రావడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఈ ఘటన నగరంలోని జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, హేమంత్ అనే యువకుడికి 'క్వాక్-క్వాక్' అనే డేటింగ్ యాప్ ద్వారా దివ్య అనే యువతి పరిచయమైంది. వీరిద్దరూ జూబ్లీహిల్స్‌లోని '36 కెమిస్ట్రీ' పబ్‌లో కలుసుకున్నారు. అయితే, అక్కడ గడిపిన కొద్దిసేపటికే పబ్ యాజమాన్యం రూ. 29,000 బిల్లు వేసిందని హేమంత్ ఆరోపిస్తున్నాడు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హనీట్రాప్ అని, సదరు యువతి పబ్ యాజమాన్యంతో చేతులు కలిపి తనను మోసం చేసిందని హేమంత్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హేమంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున పూర్తి వివరాలు వెల్లడించడానికి పోలీసులు నిరాకరించారు. ఈ ఉదంతంతో డేటింగ్ యాప్‌ల వినియోగదారుల్లో మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆసియా క్రీడల్లో నీరూ ధండా చారిత్రక స్వర్ణం.. అభినందించిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి.. జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత షూటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరూ ధండా చారిత్రక స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల చరిత్రలో ఈ విభాగంలో వ్యక్తిగత స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె రికార్డు సృష్టించింది. ఇదే ఈవెంట్‌లో మహిళల జట్టు రజత పతకాన్ని గెలుచుకుని భారత్ ఖాతాలో మరో పతకాన్ని చేర్చింది. ఈ చారిత్రక విజయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందిస్తూ ఎక్స్ లో పోస్టులు పెట్టారు. "నీరూ ధండా భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించింది. ఆసియా క్రీడల ట్రాప్ ఈవెంట్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళగా నిలిచిన ఆమెకు అభినందనలు. ఆమె అద్భుతమైన కచ్చితత్వం, నిలకడ దేశానికి గర్వకారణం. ఈ విజయం ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తి నిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. అలాగే, టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన మనీషా, నీరూ, ఆషిమాలను కూడా ప్రధాని అభినందిస్తూ, వారి టీమ్‌వర్క్‌ను ప్రశంసించారు. మంగళవారం జరిగిన ఫైనల్‌లో నీరూ ధండా అత్యంత నిలకడైన ప్రదర్శన కనబరిచింది. మొత్తం 28 హిట్లు సాధించి అగ్ర స్థానంలో నిలిచింది. చైనాకు చెందిన సన్ యుసోంగ్ (26 హిట్లు) రజతం గెలుచుకోగా, కువైట్‌కు చెందిన హజర్ అబ్దుల్‌మాలిక్ (21 హిట్లు) కాంస్యంతో సరిపెట్టుకుంది. అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లోనూ 118 పాయింట్లతో నీరూ అగ్ర స్థానంలో నిలవడం విశేషం. మరోవైపు, మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో నీరూ ధండా, ఆషిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కూడిన భారత బృందం రజత పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈ ముగ్గురూ సంయుక్తంగా 328 స్కోరు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో చైనా (346) స్వర్ణం గెలుచుకోగా, కువైట్ (325) కాంస్య పతకం దక్కించుకుంది. అయితే, ఆషిమా, మనీషా వ్యక్తిగత ఫైనల్స్‌కు అర్హత సాధించలేక పోయారు.

బుల్లెట్ ట్రైన్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా

- కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి..

బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ కుంభకోణానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీ అభివృద్ధికి గానీ, బుల్లెట్ ట్రైన్‌కు గానీ వ్యతిరేకం కాదని, కానీ దాని ముసుగులో రైతుల భూములను లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా, తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న బహదూర్‌పల్లి వ్యవసాయ భూములను ఎందుకు సేకరిస్తున్నారని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక రైల్వే స్టేషన్ కోసం వెయ్యి ఎకరాలు అవసరమా? అని నిలదీశారు. రైతుల భూములపై సుమారు 4,000 మంది పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వం వద్ద సరైన పత్రాలు ఉంటే వాటిని రైతులకు చూపించాలి, అంతేకానీ పోలీసులను పెట్టి భయపెట్టడం ఎందుకు?" అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. "ఏడాదిన్నరలో మీ ఆశీస్సులతో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారు. మీ పట్టాలు మీకే ఇప్పిస్తాం. మీకోసం హైకోర్టుకు వెళ్లిన కార్తీక్ రెడ్డి ద్వారానే మీకు పట్టాలు అందేలా చూస్తాం," అని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులు అధైర్యపడొద్దని, ఐక్యంగా ఉండాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా, న్యాయపరంగా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

దసరా వేళ పాలపిట్టలను బంధిస్తే కఠిన చర్యలు..

అటవీశాఖ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి..

దసరా పండుగ సందర్భంగా పాలపిట్టలను పట్టుకుని పంజరాల్లో బంధించడం, ప్రదర్శించడం వంటి చర్యలను ఉపేక్షించేది లేదని, ఇలాంటి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అటవీ దళాల అధిపతి (హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్) వినయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నిన్న హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాలపిట్టల సంరక్షణ, ప్రమాదకరమైన చైనా మాంజా నియంత్రణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ.. విజయ దశమి రోజు పాలపిట్టను చూడటం శుభ సూచకంగా భావించే సంప్రదాయం ఉందని, అయితే కొందరు ఇదే అదనుగా వాటిని పట్టుకుని పంజరాల్లో బంధించి ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల పక్షులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతాయని, ఆహారం తీసుకోక బలహీనపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది దసరా సమయంలో బంధించిన 28 పాలపిట్టలను స్వాధీనం చేసుకుని తిరిగి విడిచిపెట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాలపిట్టలను బంధించడం వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం నేరమని స్పష్టం చేశారు.

స్వేచ్ఛగా చూడటమే సంప్రదాయం

విజయదశమి రోజు పాలపిట్టను చూడాలనే నమ్మకం తరతరాలుగా కొనసాగుతోందని, తెలంగాణ సంస్కృతిలో దీనికి ప్రత్యేక స్థానం ఉందని అధికారులు తెలిపారు. అయితే, ఆ సంప్రదాయం ప్రకారం పాలపిట్టను దాని సహజ ఆవాసంలో స్వేచ్ఛగా ఎగురుతుండగా చూడాలి తప్ప, పంజరంలో బంధించి చూడటం కాదని వారు స్పష్టం చేశారు. దసరా ఉత్సవాలు జరిగే ప్రదేశాలు, ముఖ్యంగా ఆలయాల వద్ద పాలపిట్టలను పంజరాల్లో ఉంచి ప్రదర్శించకుండా పర్యవేక్షించాలని దేవాదాయ శాఖ అధికారులకు అటవీశాఖ సూచించింది. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

చైనా మాంజాపైనా ఉక్కుపాదం

ఇదే సమావేశంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో వినియోగించే ప్రమాదకరమైన చైనా మాంజాపైనా అధికారులు చర్చించారు. గాజు పొడి పూసిన ఈ మాంజా వల్ల పక్షులు తీవ్రంగా గాయపడి మరణిస్తున్నాయని, కొన్నిసార్లు మనుషులకు కూడా ప్రాణాపాయం కలిగిస్తోందని వినయ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో చైనా మాంజా అమ్మకాలు, నిల్వలు, వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు సంబంధిత శాఖలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కలెక్టరేట్ సిద్ధంగా ఉన్నా ప్రారంభించలేని ప్రభుత్వం..

- **కుటుంబ పదవులపై ఉన్న శ్రద్ధ వరంగల్ తూర్పు ప్రజలపై లేదా? - ఎర్రబెల్లి ప్రదీప్ రావు**





వరంగల్ తూర్పు,సెప్టెంబర్ 29(నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను నిలదీస్తూ బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో ఓ సిటీ క్యాంపు కార్యాలయం నుంచి నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసనలో భాగంగా బూడిద గుమ్మడికాయలు కొట్టి దిష్టి తీసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ.. భవనం నిర్మాణం పూర్తయినా నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్‌ను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా వరంగల్‌లో ఉన్నప్పుడు ప్రజలు ప్రతి ప్రభుత్వ పనికోసం హన్మకొండకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని నిలదీశారు. ఏ శాఖ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు తిరగాల్సి వస్తోందని, తమ సమస్యలు చెప్పుకోవడానికి కూడా హన్మకొండ చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందన్నారు. "కుటుంబంలో ఎవరికి ఏ పదవి రావాలి.. ఎవరు ఎమ్మెల్సీ కావాలి.. ఎవరు ఎమ్మెల్యే కావాలి అనే ఆరాటం ఉంటే, మీ కుటుంబానికి ఎన్ని పదవులు కావాలో అన్ని పదవులు తీసుకోండి.. చివరికి ముఖ్యమంత్రి పదవి కూడా మీరే తీసుకోండి. కానీ మిమ్మల్ని గెలిపించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు మీరు ఏం న్యాయం చేస్తున్నారు?" అని ప్రదీప్ రావు ప్రశ్నించారు. "నెలలో కనీసం 20 రోజులైనా తూర్పు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు వినే బాధ్యత మీకు లేదా? అధికారంలో ఉన్నప్పుడు పదవులు కావాలి.. కానీ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన సమయానికి ప్రజలకు అందుబాటులో ఉండరా?" ఇలాగే చేస్తే రాబోయే రోజుల్లో మీ యొక్క క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని అని హెచ్చరించారు.

"మంత్రి పదవి ఉన్నా ప్రజలకు ఏం చేయలేదు?

కాకతీయుల చారిత్రక రాజధాని అయిన వరంగల్‌లో నిర్మించిన నూతన కలెక్టరేట్ ముందు కాకతీయ కీర్తి తోరణం లేకపోవడం కూడా ప్రజల మనోభావాలను దెబ్బతీసే అంశమన్నారు. కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించి, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను వరంగల్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "పదవుల కోసం రాజకీయాలు చేయడం కాదు.. ప్రజల కోసం పనిచేయండి. వరంగల్ తూర్పు ప్రజలకు అందుబాటులోకి రండి. పూర్తయిన కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించండి. ప్రజలను ఇంకా ఎన్నాళ్లు హన్మకొండకు తిప్పుతారు?" అని ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను సూటిగా ప్రశ్నించారు. వీరితో పాటు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, జలగం రంజిత్, సీనియర్ నాయకులు కుసుమ సతీష్, వంగాల సమ్మిరెడ్డి, రత్నం సతీష్ షా, తాజా మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, గోకుల రాణా ప్రతాప్ రెడ్డి మరియు తదితర రాష్ట్ర జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

విలీన గ్రామాల్లో పారిశుధ్యంపై కమిషనర్ ఫోకస్

- **జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న ఆదేశాలు**
- **ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో ఎక్కడా లోపాలు ఉండొద్దు**



హన్మకొండ ,సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో పారిశుధ్య పనుల్లో ఎక్కడా లోపాలు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం విలీన గ్రామాల పరిధిలో పారిశుధ్య పనులను కమిషనర్ ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. వడ్డేపల్లి చర్చి నుంచి ఉనికిచర్ల వరకు ప్రధాన రహదారులు, అనుసంధాన రహదారులను పరిశీలించి పారిశుధ్య నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారి మధ్యలోని డివైడర్లపై మట్టి, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు తప్పనిసరిగా కేటాయించిన దుస్తులు ధరించి విధులకు హాజరుకావాలని, బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యాధులు ప్రబలకుండా విలీన గ్రామాల్లో క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో పొగమందు పిచికారీ చేయాలని అధికారులకు సూచించారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లోనూ చెత్తను సకాలంలో సేకరించి తరలించాలని, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సిబ్బంది విధులను పర్యవేక్షించాలని కమిషనర్ వెంకన్న ఆదేశించారు.

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాపాడాలి

- **పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడుతా**
- **జనసేన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్**



హన్మకొండ ,సెప్టెంబర్ 29 (నిత్యం నిఘాప్రతినిధి): ఎంతో మంది త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జనసేన పార్టీ వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కుటుంబ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పాలనలో ప్రజాస్వామ్య విలువలను, పట్టభద్రుల హక్కులను పరిరక్షించడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు. పట్టభద్రులు, మేధావులు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. తనకు అవకాశం కల్పించి ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతానని గడల శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

పేద విద్యార్థులకు అండగా గ్రామపంచాయతీ

- **ఉచిత ట్యూషన్‌కు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ**
- **సమస్యపై స్పందించిన సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం**



ములుగు జిల్లా / మల్లంపల్లి, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): మల్లంపల్లి ఆరో వార్డులో పేద విద్యార్థుల కోసం ఉచితంగా నిర్వహిస్తున్న ట్యూషన్‌కు గ్రామపంచాయతీ అండగా నిలిచింది. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆరో వార్డు సభ్యులందరూ మంగళవారం సర్పంచ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల తలెత్తిన సమస్యపై సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం వెంటనే స్పందించి పేద విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ట్యూషన్ నిర్వహణకు అవసరమైన లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్ తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించి సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఆరో వార్డు ప్రజలు, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థుల చదువుకు గ్రామపంచాయతీ సహకారం అందించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

మంథనిలో ఘనంగా అంగారక చతుర్థి వేడుకలు

- **శ్రీ మహాగణపతిని దర్శించుకున్న భక్తులు**
- **సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడికి ప్రత్యేక పూజలు**



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ ప్రధాన బస్టాండ్‌లో సోమవారం ప్రమాదవశాత్తు ఓ మహిళ బస్సు ముందు టైరు కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన చుక్క నిర్మల హైదరాబాద్ వెళ్లేందుకు హనుమకొండ బస్టాండ్‌కు వచ్చినట్లు సమాచారం.హైదరాబాద్ వైపు వెళ్లే బస్సు ఎక్కిన ఆమెకు సీటు ఖాళీగా లేకపోవడంతో తిరిగి కిందకు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బస్సు ముందు టైరు కింద పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే స్పందించిన తోటి ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది EMT మహేందర్, పైలట్ విజయ్ భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు, పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

హీరో నాని రాకతో ములుగులో సందడి

- **'ది ప్యారడైజ్' చిత్రబృందానికి ఘన స్వాగతం పలికిన మొర్రి రాజు యాదవ్**
- **మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న చిత్రబృందం**



ములుగు, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): 'ది ప్యారడైజ్' చిత్రబృందం మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకునేందుకు ములుగు జిల్లాకు చేరుకోవడంతో సందడి నెలకొంది. మేడారం వెళ్లే మార్గంలోని గట్టమ్మ ఆలయం వద్ద మల్లంపల్లి మండల బీఆర్ఎస్ యువజన నాయకుడు మొర్రి రాజు యాదవ్ ఆధ్వర్యంలో చిత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. దర్శకుడు ఓదెల శ్రీకాంత్, హీరో నాని, సంపూర్ణేష్ బాబు తదితరులకు పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ చరిత్ర, తెలంగాణ సాధనలో నాయకుల కృషిని ప్రతిబింబించేలా చారిత్రక కథాంశంతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్ర బృందాన్ని మొర్రి రాజు యాదవ్ అభినందించారు. అనంతరం చిత్రబృందం మేడారం చేరుకుని సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది.ఈ కార్యక్రమంలో శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, పట్టణ అధ్యక్షుడు చీదర సంతోష్, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు మెరుగు రాజు, ఓన్నాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సహకార సంఘం చైర్మన్ల సన్మానం

- పర్వతగిరి సహకార సంఘం చైర్మన్‌గా పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి సహకార సంఘం చైర్మన్‌గా అత్తి కుమారస్వామి



పర్వతగిరి, సెప్టెంబర్ 30 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నియమితులైన పర్వతగిరి సహకార సంఘం చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి సహకార సంఘం చైర్మన్ అత్తి కుమారస్వామిని శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం సభ్యులు వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పిన్నింటి అనిల్‌రావు మాట్లాడుతూ, యాదవ సోదరులకు సహకార సంఘం ద్వారా అవసరమైన సహాయం, సహకారం అందించడంతో పాటు పారదర్శకంగా పనిచేస్తామని తెలిపారు. గొర్రెలు, మేకలు, పశువుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.యాదవ సంఘం అభివృద్ధి, సభ్యుల సమస్యలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రితో పాటు శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు యూనిఫారాలు పంపిణీ

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోంది: సర్పంచ్ దండేవేన సంధ్యా బానేష్



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్యా బానేష్ యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం, పాఠశాల యూనిఫారాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.
మంథని ప్రాంతంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీను బాబు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నారని సర్పంచ్ కొనియాడారు.
కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్క లక్షి , వార్డు సభ్యురాలు భోగే రాజేశ్వరి, వీవోఓలు స్వప్న, తిరుమల, సీఏలు రాధ, భూలక్షి , పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంజపడుగులో ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు

గుంజపడుగు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గద్దలపల్లి ఆధ్వర్యంలో ఛాతీ ఎక్స్‌రే పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పద్మ, వైష్ణవి, ఆశా కార్యకర్తలు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

కొడిశల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సర్పంచ్

- వైద్య సిబ్బంది, రోగులకు అవసరమైన సౌకర్యాలపై ఆరా
- అధికారులు వెంటనే స్పందించి కాలువలు శుభ్రం చేయాలని స్థానికుల డిమాండ్



లింగాల, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): లింగాల గ్రామపంచాయతీ పరిధిలోని కొడిశల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మొదలపల్లి రవీందర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందితో మాట్లాడి రోజువారీగా ఎంతమంది రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు సుమారు 20 నుంచి 30 మంది వరకు రోగులు వస్తున్నట్లు సిబ్బంది సర్పంచ్‌కు వివరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు విజయ్ ఆసుపత్రిలో చేపట్టాల్సిన చిన్నపాటి మరమ్మతుల గురించి సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ పంకాలు, కిటికీలు తదితర వాటికి మరమ్మతులు అవసరమని తెలిపారు. అదేవిధంగా ఉపకేంద్రానికి సంబంధించిన సమస్యలను కూడా వివరించారు. ఆరోగ్య కేంద్రంలో అవసరమైన చిన్నపాటి మరమ్మతులను త్వరలోనే చేపట్టి సౌకర్యాలు మెరుగుపరుస్తామని సర్పంచ్ మొదలపల్లి రవీందర్ తెలిపారు.



వైద్య సేవలు అందించడంలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ తనిఖీలో పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన పరశురాములుకు ఘన సన్మానం

- సామాజిక సేవలో మరింతగా ముందుకు సాగాలి: రిటైర్డ్ ఉపాధ్యాయుడు సదానందం



వరంగల్, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన మండల పరశురాములును తెలంగాణ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రంగశాయిపేట ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదాన ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు దామెరకొండ సదానందం మండల పరశురాములును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ అంతర్జాతీయ స్థాయిలో సేవలు అందిస్తున్న సంస్థగా పేర్కొన్నారు. సంస్థలో బాధ్యతలు చేపట్టిన ప్రతి నిధులు సమాజంలోని నిరుపేదలు, అవసరంలో ఉన్న ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. మండల పరశురాములు గత అనేక సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న అంకితభావం కలిగిన సామాజిక కార్యకర్త అని సదానందం కొనియాడారు. రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పెర్క సోమేశ్వర్, సాంబయ్య, ఎమ్మడిశెట్టి రవీందర్, రామచందర్, పెరుమాండ్ల పరశురాములు, చిత్యాల రమేష్ బాబు, వీరన్న, రాజు తదితరులు పాల్గొని మండల పరశురాములుకు అభినందనలు తెలిపారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- చెడు సావాసాలకు, తాత్కాలిక ఆకర్షణలకు లోనుకావొద్దు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపు



హన్మకొండ ,సెప్టెంబర్ 29 (నిత్యం నిఘాప్రతినిధి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతూ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆమె సూచించారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఆమె అన్నారు. యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చెడు సావాసాలకు, తాత్కాలిక ఆకర్షణలకు లోనుకాకుండా తమ లక్ష్య సాధనపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కళాశాల దశ జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ సమయంలో సాధించే విజయాలు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణానికి విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు సమష్టిగా భాగస్వాములు కావాలని చాహత్ బాజ్‌పాయ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, జాతీయ సేవా పథకం సమన్వయకర్తలు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

పాత్రికేయులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది

- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పాత్రికేయుల సేవలు



పెద్దపల్లి జిల్లా, మంథని, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పాత్రికేయుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులు మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. క్లబ్ అధ్యక్షుడు కోడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహావాది సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు పాత్రికేయుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం అందజేశారు. వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంథని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పాత్రికేయులను అడిగి తెలుసుకున్నారు. ప్రాంతీయ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ప్రభుత్వానికి తమ సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న పాత్రికేయులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు అక్కల నారాయణ, సభ్యులు ఎగోలపు సంతోష్ గౌడ్, మాదేశి శ్రావణ్ కుమార్, కాశీపేట శ్రీకాంత్, ఎండీ సుభాన్, మంథని లక్ష్మణ్‌తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

వరంగల్ తూర్పులో 111 మందికి రూ.61 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు

- త్వరలో కల్యాణలక్ష్మి చెక్కులు.. నూతన కలెక్టరేట్ ప్రారంభానికి బిల్లుల సమస్య
- వారానికి ఒక రోజు డివిజన్‌లో పర్యటిస్తా: ఎమ్మెల్యే కొండా సురేఖ





వరంగల్ ,సెప్టెంబర్ 29 (నిత్యం నిఘాప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన 111 మంది లబ్ధిదారులకు రూ.61 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కొండా సురేఖ పంపిణీ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ త్వరలోనే కల్యాణలక్ష్మి చెక్కులను కూడా లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు నిలిచిపోయాయని ఆమె ఆరోపించారు. ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధిపై బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎంజీఎం సందర్శనకు వెళ్లిన కొంతమంది నాయకులు పరస్పరం గొడవపడి ఆసుపత్రిలో చేరారని వ్యాఖ్యానించారు. త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎనిమిది అంతస్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్ భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ గుత్తేదారుల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ప్రారంభించలేకపోతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. కిలా వరంగల్‌లో పురాతన దేవాలయాలు వెలుగులోకి వచ్చాయని, వాటి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు అవసరం కావడంతో పనులు చేపట్టడంలో ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. మంత్రిగా ఉన్న సమయంలో తూర్పు నియోజకవర్గానికి తగినంత సమయం కేటాయించలేకపోయానని పేర్కొన్న సురేఖ.. ఇకపై వారానికి ఒక రోజు ఒక డివిజన్‌లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని అన్నారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు నిధులు కేటాయించామని, డివిజన్లలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. జర్నలిస్టులకు త్వరలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీలోని వర్గ విభేదాలను పక్కనపెట్టి పార్టీ కోసం పనిచేయాలని, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శలకే పరిమితమవుతున్నారని సురేఖ విమర్శించారు. కొంతమంది నాయకులు హద్దులు దాటి మాట్లాడకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 24 స్థానాలకు 24 స్థానాలు గెలుస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అక్టోబర్ 6న ఛలో ఉస్మానియా యూనివర్సిటీని విజయవంతం చేయాలి

- ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల మహాసభకు విద్యార్థులు తరలిరావాలి
- విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయాలి: ఎంఆర్పీఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జి చాతాళ్ల రమేష్ మాదిగ



ములుగు జిల్లా, వాజేడు, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): అక్టోబర్ 6న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జి చాతాళ్ల రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మాదిగ విద్యార్థులను మహాసభకు పెద్ద సంఖ్యలో తరలించేందుకు ఎంఆర్పీఎస్ శ్రేణులు కృషి చేయాలని కోరారు.మంగళవారం వాజేడు మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఎంఆరపఃీఎస్ మాజీ అధ్యక్షుడు చెన్నం స్వామి మాదిగ ఆధ్వర్యంలో ఎంఎస్ఎఫ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాతాళ్ల రమేష్ మాదిగ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక ఉద్యమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.విద్యార్థి ఉద్యమాలు బలహీనంగా ఉన్న సమయంలో విద్యార్థి లోకానికి నాయకత్వం వహించేలా ఎంఎస్ఎఫ్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగ విద్యార్థులను శాస్త్రీయంగా, సైద్ధాంతికంగా, నిర్మాణాత్మకంగా బలోపేతం చేస్తూ కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా పోరాటం కొనసాగించామని ఆయన పేర్కొన్నారు. వర్గీకరణ ద్వారా లభించే అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. విద్యా, ఉద్యోగ రంగాలతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు మేధస్సు, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. జాతి భవిష్యత్తు, పీడిత వర్గాల విముక్తి కోసం విద్యార్థి తరం కీలకమని రమేష్ మాదిగ అన్నారు. విద్యార్థులను ఉద్యమంలో భాగస్వాములను చేస్తూ, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించే స్థాయిలో ఎంఎస్ఎఫ్‌ను బలంగా నిర్మించాలని కోరారు.కుల వివక్ష, పేదరికం, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రజా పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరుస్తూ ఎంఆర్పీఎస్, అనుబంధ విభాగాలను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న కమిటీలను పూర్తి చేసి ఉద్యమాన్ని మరింత బలపరచాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుగ్గిళ్ల నరేందర్, బలుసుపాటి స్వామి మాదిగ, కేసరి రాజు మాదిగ, లేగల్ల ప్రవీణ్ మాదిగ, లేగల్ల రవి మాదిగ, పేట సమ్మయ్య మాదిగ, చిట్యాల రాకేష్ మాదిగ, ఇల్లందల రాజు మాదిగ, శ్రీకాంత్ మాదిగ, ఎం.పెళ్లి శంకర్ మాదిగతో పాటు ఎంఎస్ఎఫ్ విద్యార్థులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దాతల సేవకు అడ్డంకులెందుకు?

- దివిటిపల్లి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణంపై వివాదం
- రాజకీయ జోక్యంతోనే అడ్డంకులు సృష్టిస్తున్నారంటున్న గ్రామస్తులు.. నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్





వర్ధన్నపేట, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థుల భవిష్యత్తు కోసం దాతల సహకారంతో నిర్మించనున్న అదనపు తరగతి గది వివాదానికి కేంద్రంగా మారింది. వర్ధన్నపేట మండలం దివిటిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దాతల కుటుంబం సొంత ఖర్చుతో కొత్త తరగతి గది నిర్మించేందుకు ముందుకు రాగా, కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు గతంలో దాత కీ.శే. శ్రీ రంగాచార్యులు వాటర్ సంపు, మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరించారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆయన సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆయన వారసులు తాజాగా మరో తరగతి గది నిర్మాణానికి ముందుకొచ్చారని తెలిపారు. అయితే నిర్మాణానికి కొందరు కాంగ్రెస్ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

పిల్లల చదువుకు అవసరమైన గదికీ వివాదమేనా?

రాజకీయాలకు అనేక వేదికలు ఉన్నాయని, విద్యార్థులు చదువుకునే తరగతి గది నిర్మాణాన్ని కూడా రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. దాతలు ముందుకొచ్చి పాఠశాలకు సౌకర్యం కల్పించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో వారిని ప్రోత్సహించాల్సింది పోయి అడ్డంకులు సృష్టిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు. తరగతి గదుల కొరత ఉన్న పాఠశాలకు అదనపు గది అందుబాటులోకి వస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని, ప్రజాప్రయోజన కార్యక్రమాలకు అన్ని వర్గాలు సహకరించాలని గ్రామస్తులు అంటున్నారు.

మండల స్థాయి నాయకుల ప్రమేయంపై ఆరోపణలు

ఈ వివాదం వెనుక కొందరు మండల స్థాయి నాయకుల ప్రమేయం ఉందనే ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత నాయకుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. నిర్మాణానికి రాజకీయ కారణాలే అడ్డంకిగా ఉన్నాయా? లేక నిబంధనలకు సంబంధించిన ఇతర అభ్యంతరాలు ఉన్నాయా? అన్నది అధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది.

పిల్లల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దు: సర్పంచ్

పాఠశాల అభివృద్ధిపై నెలకొన్న వివాదంపై గ్రామ సర్పంచ్ అహల్య దేవి స్పందిస్తూ, పాఠశాల అభివృద్ధి రాజకీయాలకు అతీతంగా ఉండాలని అన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అందరూ సహకరించాలని కోరారు. దాతల సహకారంతో చేపడుతున్న తరగతి గది నిర్మాణం సజావుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు

తరగతి గది నిర్మాణంపై తలెత్తిన వివాదాన్ని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిర్మాణానికి నిబంధనల పరమైన అభ్యంతరాలు ఉంటే వాటిని స్పష్టంగా తెలియజేయాలని, రాజకీయ కారణాలతో అడ్డంకులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉంటే వాటిపైనా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గది నిర్మాణానికి దాతలు ముందుకొచ్చినప్పటికీ వివాదం ఎందుకు తలెత్తిందనే ప్రశ్నలు ప్రస్తుతం దివిటిపల్లిలో చర్చనీయాంశంగా మారాయి.x

నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న జడ్జి

- ఊకల్ హవేలి ఆలయంలో ప్రత్యేక పూజల



గీసుకొండ, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): గీసుకొండ మండలం ఊకల్ హవేలిలోని శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని వరంగల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నిర్మల గీతాంబ మంగళవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు న్యాయమూర్తి చేత ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెను ఆశీర్వదించారు.కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్‌గౌడ్, ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, సీఐ విశ్వేశ్వర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- బ్లాక్‌స్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



హన్మకొండ/ఎల్కతుర్తి,సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పరిధిలోని వరంగల్–కరీంనగర్ జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న మూడు ప్రాంతాలను పోలీస్ శాఖ బ్లాక్‌స్పాట్లుగా గుర్తించింది. ఈ ప్రమాదకర ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మంగళవారం రోడ్లు, భవనాల శాఖ, నేషనల్ హైవే, ఆర్టీవో అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారి పరిస్థితులు, మలుపులు, వాహనాల వేగం, ట్రాఫిక్ రద్దీ తదితర అంశాలపై వివరాలు సేకరించారు. ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో పాటు హెచ్చరిక సైన్‌బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాలపై వాహనదారులకు ముందుగానే సమాచారం అందేలా తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ తనిఖీ

అనంతరం కమిషనర్ ఎన్.శ్వేత ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, కేసుల వివరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలు తమ సమస్యలను సులభంగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చేలా, వారికి మెరుగైన పోలీసు సేవలు అందే విధంగా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కవిత, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) రాయల ప్రభాకర్‌రావు, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, ఆర్టీవో మధుసూదన్‌రెడ్డి, నేషనల్ హైవే అధికారులు, సీఐ కొండ్రు శ్రీనివాస్, ఎస్సై నరసింహారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై సీపీ ప్రత్యేక దృష్టి

- వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో ప్రమాద స్థలాల పరిశీలన
- ప్రమాదాలకు కారణాలపై ఆరా.. భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు





వర్ధన్నపేట, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట, రాయపర్తి మండలాల పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మంగళవారం ప్రమాద స్థలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద స్థలాల్లో రహదారి పరిస్థితులు, మలుపులు, రహదారి వెడల్పు, వెలుతురు, ట్రాఫిక్ రద్దీ తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని ప్రమాదకర ప్రాంతాలుగా పరిగణిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా వాహనాల వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, అవసరమైన చోట ఇతర భద్రతా చర్యలు చేపట్టడంపై దృష్టి సారించాలని సూచించారు. రహదారి పరిస్థితులకు సంబంధించిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో పాటు రహదారులు, భవనాలు, మున్సిపల్ తదితర సంబంధిత శాఖల మధ్య సమన్వయం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా, ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని సీపీ సూచించారు.

వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవాధికార సంస్థ అండ





పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథనిలోని ప్రణామ్ డే కేర్ సెంటర్ ఆవరణలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళ వారం ప్రత్యేక సమావేశం, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు సంక్షేమ పథకాలు, వారి హక్కులు, రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనిజ కోయిర్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, సమాజంలో వయోవృద్ధుల పాత్ర ఎంతో విలువైనదని అన్నారు. వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.జిల్లా కలెక్టరేట్ మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ రాజయ్య, క్షేత్రస్థాయి స్పందన అధికారి స్వర్ణలత, సీడీపీఓ పుష్పలత వయోవృద్ధులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, వారి రక్షణకు ఉన్న చట్టాలు, అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ఉచిత ఫోన్ సేవలపై అవగాహన కల్పించారు.అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ శివాని, వైద్య బృందం వయోవృద్ధులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శశిభూషణ్ కాచే, షబానా, జి. శ్రీలక్ష్మి , ప్రణామ్ డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ పుష్పలతతో పాటు సీనియర్ సిటిజన్లు ఖాజా మొయినుద్దీన్, వేపచెట్టు రాజన్న, నూనె రాజేశం, మెడగోని రాజమౌళి గౌడ్, ఇతర వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలం ఆక్రమణపై నాయి బ్రాహ్మణ సంఘం ఫిర్యాదు



ములుగు జిల్లా , సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లాలో తెలంగాణ నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని ఆరోపిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ కంఠం కింద కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కుల వెంకటేష్ కోరారు.సంఘం ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ సంపత్‌రావును కలిసి సమస్యను వివరించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన పాత రికార్డులను పరిశీలించాలని కోరారు. ముఖ్యంగా 1976 సంవత్సరంలో గ్రామపంచాయతీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న ఆనవాళ్లు తమ వద్ద ఉన్నాయని, వాటిని ఆధారాలుగా పరిగణనలోకి తీసుకుని స్థల వివాదాన్ని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలంపై జరిగినట్లు చెబుతున్న ఆక్రమణపై సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సంపత్‌రావు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జంపాల సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్న కుమార్, కార్యదర్శి ముత్యాల ప్రకాశ్, మురారి రామకృష్ణ, వేల్పుగొండ శరబంధం, నరేందర్, వెంకట స్వామి, చిక్కుల స్వామి, సముద్రాల రమేష్, జంపాల శ్రీనివాస్, ముత్యాల రాజు, చిన్న సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ కమిటీ ఎన్నిక

- **25 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న నాయకులు**
- **పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: కోట నరేంద్ర తేజ**



ములుగు జిల్లా/వాజేడు, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.వెంకట నరసయ్య ఆదేశాల మేరకు, ములుగు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల రమేష్ సూచనలతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు.వెంకటాపురం–వాజేడు మండలాల ఇన్‌చార్జి, ములుగు జిల్లా ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు కోట నరేంద్ర తేజ, జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శులు చల్లూరి సతీష్, బలుసుపాటి నరసయ్య, వాజేడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ములకల ప్రశాంత్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది.కృష్ణాపురం గ్రామ అధ్యక్షుడిగా గజ్జల నవీన్, ఉపాధ్యక్షుడిగా లంక రాజబాబు, ప్రధాన కార్యదర్శిగా బలుసుపాటి శోభన్, సహాయ కార్యదర్శిగా బలుసుపాటి నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. గ్రామ కమిటీలో మొత్తం 25 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా కోట నరేంద్ర తేజ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గజ్జల ఆదినారాయణ, దుర్గం బాబు, సప్పిడి శ్రీదేవి, బలుసుపాటి జయమ్మ, గజ్జల దేవేందర్, గజ్జల నాగేంద్రబాబు, పేట లాలమ్మ, తిప్పనపల్లి సుశీల, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుపట్లలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ కమిటీ ఎన్నిక

- **గ్రామ అధ్యక్షుడిగా చిడుముల వెంకటి.. 26 మందితో ఏకగ్రీవంగా కమిటీ ఏర్పాటు**
- **పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: కోట నరేంద్ర తేజ**



ములుగు జిల్లా/వాజేడు, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా వాజేడు మండలం చండ్రుపట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.వెంకట నరసయ్య ఆదేశాల మేరకు, ములుగు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి సూచనలతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు.ములుగు జిల్లా ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు, వాజేడు–వెంకటాపురం మండలాల ఇన్‌చార్జి కోట నరేంద్ర తేజ, వాజేడు మండల ప్రధాన కార్యదర్శులు చల్లూరి సతీష్, బలుసుపాటి నరసయ్య, సర్పంచ్ అనుముల సంధ్యారాణి, మండల అధ్యక్షుడు ములకల ప్రశాంత్ ఆధ్వర్యంలో సోమవారం కమిటీ ఎన్నిక జరిగింది. మొత్తం 26 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.చండ్రుపట్ల గ్రామ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చిడుముల వెంకటి, ఉపాధ్యక్షుడిగా బగుతు మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా దుర్గం నవీన్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా కోట నరేంద్ర తేజ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో గోగు తిరుపతి రావు, బగుతు సంతోష్, అన్వేష్, బాబు, డొంగిరి రవి, జనగాం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల అనుభవాలు భావితరాలకు మార్గదర్శకం





వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వృద్ధాప్యం భారంగా భావించకుండా వయోవృద్ధుల అనుభవాలను భావితరాలకు మార్గదర్శకంగా చూడాలని అంగన్వాడీ సూపర్వైజర్ చంద్రకళ అన్నారు. కుటుంబాల్లో వయోవృద్ధులకు ప్రేమ, గౌరవం, ఆత్మీయత, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.
అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రకళ వయోవృద్ధులతో ఆత్మీయంగా ముచ్చటించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వయోవృద్ధులు కుటుంబానికి జీవంత అనుభవ పాఠశాలలని అన్నారు. వారి జీవిత అనుభవాలు, సూచనలు భావితరాలకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. పిల్లలు, యువత వయోవృద్ధులను గౌరవిస్తూ వారితో ఆత్మీయంగా మెలగాలని సూచించారు.

వృద్ధులకు అండగా నిలవాలి

పిల్లలు, వయోవృద్ధుల మధ్య అనుబంధాన్ని పెంపొందించేలా ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. వయోవృద్ధులకు అవసరమైన వైద్య సహాయంతో పాటు ప్రేమ, గౌరవం, భద్రత కల్పించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందని చంద్రకళ తెలిపారు.
వయోవృద్ధులకు సహాయం లేదా సమాచారం అవసరమైనప్పుడు 14567 ఉచిత ఫోన్ సేవను సంప్రదించవచ్చని ఆమె సూచించారు. అనంతరం వయోవృద్ధుల సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం, కుటుంబంలో ఆత్మీయ వాతావరణం కోసం పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు.
కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమరేందర్, అంగన్వాడీ టీచర్లు వజ్రమ్మ, బుజ్జమ్మ, ఆయా సుశీల, వయోవృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై బీజేపీ నిరసన.. దిష్టిబొమ్మ దహనం

- **హిందూ దేవుళ్లను కించపరిచే వ్యాఖ్యలు సహించేదిలేదు: బీజేపీ నేతలు**



వలింగాల ఘనపూర్, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో లింగాల ఘనపూర్ మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు, జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడా రమేష్ సూచనలతో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందూ ధర్మం, దేవుళ్లను కించపరిచే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వారు అన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇటీవల రేవంత్‌రెడ్డి రాముడు, శివుడిని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. బీజేపీ నేతలు ఆ వ్యాఖ్యలను హిందూ దేవతలను విభజించేలా ఉన్నాయని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వెంకట్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కెమిడి నాగరాజు, జిల్లా నాయకులు గోరోగే సంపత్, నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి కోమరాజు సందీప్, నాయకులు మేడ శ్రీను, వీరస్వామి, కార్తీక్, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

స్టేషన్ ఘనపూర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- వనపర్తి, కొత్తపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి







లింగాల ఘనపూర్, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం లింగాల ఘనపూర్ మండలం వనపర్తి, కొత్తపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు.వనపర్తి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన కడియం శ్రీహరి, మరో రూ.20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తపల్లి గ్రామంలో రూ.37.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లతో పాటు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.లింగాల ఘనపూర్ మండలంలోని ప్రతి ఎకరాకు రెండు పంటలకు సాగునీరు అందించేలా కృషి చేస్తానని కడియం శ్రీహరి తెలిపారు. తాను 24 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన దేవాదుల ప్రాజెక్టు పూర్తై నియోజకవర్గానికి సాగునీరు అందించడం సంతృప్తినిస్తోందన్నారు.గత మూడేళ్లలో వనపర్తి గ్రామ అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కొత్తపల్లి నుంచి డిక్య తండా వరకు రూ.85 లక్షలతో రహదారి నిర్మాణం, కొత్తపల్లి నుంచి లింగాల ఘనపూర్ వరకు ఎచ్ఏఎం పథకం కింద రూ.9 కోట్లతో రెండు వరుసల రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. కొత్తపల్లిని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు.ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై కడియం శ్రీహరి విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, రుణమాఫీ వంటి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం 2026 సెప్టెంబర్‌లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు అధికారికంగా వెల్లడించింది.గతంలో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వారు చేసిన అభివృద్ధిపై ప్రజలు ఆలోచించాలని కడియం శ్రీహరి కోరారు. బీఆర్ఎస్, బీజేపీలపై కూడా ఆయన విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు గమనించాలని అన్నారు.కార్యక్రమాల్లో వనపర్తి, కొత్తపల్లి గ్రామాల సర్పంచులు వంచ శైలజ ఉపేందర్‌రెడ్డి, గాదెపాక విష్ణు, డీసీసీ ఉపాధ్యక్షులు గుడి వంశీధర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ మనోహర్, తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీవో భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- బ్యాంకు రుణాల వసూళ్లలో వంద శాతం లక్ష్యం సాధించాలి.. ఎన్పీఏ శాతం సున్నాకు తీసుకురావాలి



హనుమకొండ, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): జిల్లాలో వివిధ దశల్లో కొనసాగుతున్న వీవో భవనాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. బ్యాంకు అనుసంధాన రుణాల వసూళ్లలో వంద శాతం పురోగతి సాధించాలని, నిరర్థక రుణాల శాతం సున్నాకు తీసుకురావాలని సూచించారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వీవో భవనాలు, రుణాల వసూళ్లు, మహిళా డెయిరీ తదితర అంశాలపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్, స్త్రీనిధి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా వీవో భవనాల నిర్మాణ పురోగతి, రుణాల వసూళ్లు, ఆయా శాఖలకు సంబంధించిన కార్యక్రమాలపై డీపీఎంలు, ఏపీఎంలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు అనుసంధాన రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరర్థక రుణాలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రుణాల వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలని సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరకాల మహిళా డెయిరీ ఏర్పాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, డీపీఎంలు రాజేంద్రప్రసాద్, సరిత, పద్మప్రియ, అనిత, దయాకర్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ రమేష్, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే పోలీస్ ఉద్యోగం సాధ్యమే

- ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు



వరంగల్, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): కష్టపడే తత్వానికి ప్రత్యామ్నాయం లేదని, ప్రణాళికాబద్ధంగా క్రమశిక్షణతో చదివితే పోలీస్ ఉద్యోగాలను సాధించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ అన్నారు. పోలీస్ ఉద్యోగార్థుల కోసం ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ల సహకారంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణలో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన 560 మంది అభ్యర్థులకు శిక్షణ తరగతుల నిర్వహణపై భీమారంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో ముందస్తు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన ఉచిత శిక్షణ ద్వారా పలువురు అభ్యర్థులు పోలీస్ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రస్తుతం ఎంపికైన అభ్యర్థులు కూడా ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా తరగతులకు హాజరై లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని అభ్యర్థులను హెచ్చరించారు. కష్టపడి చదవడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఉద్యోగం సాధించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, అదనపు డీసీపీ సురేష్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కేయూసీ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తుల కంటే ముందుండాలి

- రోడ్డు ప్రమాదాల నివారణ, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి



భూపాలపల్లి , సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి); మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకుంటూ నేరస్తుల కంటే పోలీసులు ఒక అడుగు ముందుండాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం మహాముత్తారం పోలీస్ స్టేషన్, కాటారం సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి విధి నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత అని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ, కనిపించేలా పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, సమాజంతో పోలీసుల అనుసంధానానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించడంతో పాటు నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.నేర దర్యాప్తులో సీసీటీఎన్ఎస్ 2.0, ఈ–సాక్ష్యం, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు, సామాజిక మాధ్యమాల పర్యవేక్షణ వంటి ఆధునిక విధానాలపై సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలు, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించేలా సేవలందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు.కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావు, మహాముత్తారం ఎస్ఐ రమేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలి

- అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు సూచన



ములుగు జిల్లా , సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు సూచించారు. ఈ మేరకు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టభద్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో నమోదు ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవసరమైన నిబంధనలు, దరఖాస్తు విధానం, అర్హతలు, అవసర మైన ధ్రువపత్రాలపై వివరించారు.పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితా కోసం నిర్ణీత విధానంలో ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులు సంబంధిత మండల తహసీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు, నియమిత అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తుతోపాటు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను జతచేయాలని సూచించారు.ఈ నియోజకవర్గానికి సంబంధించి 2023 నవంబర్ 1ను అర్హత తేదీగా తీసుకుని ఓటర్ల జాబితాను తాజాగా రూపొందించే ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టింది. ఇప్పటికే పాత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం నిర్దేశిత విధానం ప్రకారం తాజా దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పాత జాబితాలో పేరు ఉండటం ఒక్కటే ప్రస్తుత నమోదుకు సరిపోదని పేర్కొంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. రవికుమార్, ఎన్నికల విభాగం డీటీఎల్‌లు నితీష్, గణపతి, సతీష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ ఈడీగా పి. విజయలక్ష్మి



నిత్యం నిఘా, భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ కార్య నిర్వాహక సంచాలకురాలిగా (ఇన్‌చార్జి) పి. విజయ లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్, సంస్థ చైర్మన్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆమెను ఈడీగా నియమించారు.జిల్లా కలెక్టర్, సంస్థ చైర్మన్ సమక్షంలో పి. విజయలక్ష్మి విధుల్లో చేరి, ఇప్పటివరకు కార్య నిర్వాహక సంచాలకుడిగా కొనసాగిన ఆర్. ఉపేందర్‌రావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

గుండె ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన.



నిత్యం నిఘా, భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29 : ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు గుండె ఆరోగ్యం, పోషకాహారం, వ్యాధుల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ తుకారామ్ రాథోడ్ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, తగినంత నిద్రతో పాటు పొగాకు, మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఒత్తిడిని నియంత్రించుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. చెవుల ఆరోగ్యం, వినికిడి లోపాలు, పాముకాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నషా ముక్త్ భారత్ అభియాన్‌పై కూడా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఏడీఎంహెచ్ఓ (టి), ఐటీడీఏ భద్రాచలం డాక్టర్ బి. సైదులు రక్తహీనత నివారణ, సమతుల్య ఆహారం, స్థానికంగా లభించే పోషకాహార పదార్థాల ప్రాధాన్యతను వివరించారు. డీపీఎంఓ మోహన్ తేజావత్ కుష్ఠు వ్యాధి లక్షణాలు, ముందస్తు గుర్తింపు, ఉచిత చికిత్స, వైకల్యాల నివారణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ విల్సన్, ప్రొఫెసర్ సుందాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారి భవిష్యత్తుకు గ్రామస్తుల భరోసా

- **మరణించిన కారోబార్ శివకుమార్ కుమార్తె పేరిట రూ.1.50 లక్షలు జమ**
- **సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆర్థిక భద్రతకు శ్రీకారం**



నిత్యం నిఘా, షాబాద్, సెప్టెంబర్ 29 : ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, తండ్రిని కోల్పోయిన 11 నెలల చిన్నారి భవిష్యత్తుకు గ్రామస్తులు భరోసా కల్పించారు. షాబాద్ మండలం లక్ష్మారావుగూడ గ్రామపంచాయతీ కారోబార్‌గా పనిచేసిన గంటల శివకుమార్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ శ్రీరంగపురం కుమార్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు, పెద్దలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు.రూ.1.50 లక్షలు సేకరించి చిన్నారి పేరిట పొదుపుశివకుమార్‌కు 11 నెలల చిన్నారి కుమార్తె ఉండటంతో ఆమె భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గ్రామ యువకులు, పెద్దలు కలిసి రూ.1,50,000 సేకరించారు. ఆ మొత్తాన్ని చిన్నారి పేరిట సుకన్య సమృద్ధి యోజన పథకం కింద జమ చేశారు. చిన్నారి చదువు, భవిష్యత్ అవసరాలకు ఈ పొదుపు ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నారు.ఆపదలో అండగా నిలిచిన గ్రామస్తులుకుటుంబంలో విషాదం చోటుచేసుకున్న సమయంలో గ్రామస్తులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. తండ్రిని కోల్పోయిన చిన్నారికి భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే పొదుపు చేయడం మంచి ఆలోచనగా గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.మానవత్వానికి నిదర్శనంగ్రామంలో ఒక కుటుంబానికి ఆపద వచ్చినప్పుడు తామంతా ఒక్కటేననే భావనతో యువకులు, పెద్దలు కలిసి సహాయం చేయడం గ్రామ ఐక్యతకు నిదర్శనమని పలువురు అన్నారు. చిన్నారి భవిష్యత్తు కోసం చేసిన ఈ ప్రయత్నం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొని చిన్నారి కుటుంబానికి తమ మద్దతు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- **రూ.7 వేల జరిమానా విధించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు**



ములుగు జిల్లా , సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): బాలికపై లైంగిక నేరానికి సంబంధించిన పోక్సో కేసులో నిందితుడికి ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతో పాటు రూ.7 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన నేర సంఖ్య 135/2021 కేసులో రామానుజాపూర్ గ్రామానికి చెందిన పల్లెబోయిన క్రాంతి(27)ని కోర్టు దోషిగా నిర్ధారించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 366, 376(2)(ఎన్), పోక్సో చట్టంలోని 5(1)తో పాటు 6 సెక్షన్ల కింద కేసు నమోదైంది.ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.వి.పి. సూర్యచంద్రకళ ఈ మేరకు తీర్పు వెలువరించారు.ఈ కేసులో ఎస్ఐ డి. రమేష్ ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, మహిళా ఎస్ఐ పి. రాధిక దర్యాప్తు క్రమంలో సంబంధిత సెక్షన్లను మార్చారు. మొదటి దర్యాప్తు అధికారిగా పి. సాయి చైతన్య, ఐపీఎస్, రెండో దర్యాప్తు అధికారిగా అప్పటి ములుగు అదనపు ఎస్పీ, ప్రస్తుత జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్, ఐపీఎస్ వ్యవహరించారు.కేసు దర్యాప్తు, కోర్టు సమన్వయం, అభియోగాల నిర్వహణలో కోర్టు పర్యవేక్షణ అధికారి డీఎస్పీ కిషోర్, కోర్టు అనుసంధాన అధికారి ఏఎస్ఐ ఎల్. కుమారస్వామి, ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది డి. రామ్‌సింగ్, సీడీపీవోలు జె. శ్రీను, వై. శ్రవంతి తదితరులు కీలకంగా పనిచేశారు.కేసు దర్యాప్తు, కోర్టు సమన్వయం, అభియోగాల నిర్వహణలో సమిష్టిగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ అభినందించారు. నాణ్యమైన దర్యాప్తు చేపట్టడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

షాదీఖానాకు అనువైన స్థలం.. మత పెద్దలకు కేటాయింపు పత్రం అందజేత

- **అందరి ఆమోదంతో స్థలం ఎంపిక.. మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రె**



హనుమకొండ, సెప్టెంబర్ 29 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీల కోసం షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలానికి సంబంధించిన పత్రాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మత పెద్దలకు అందజేశారు. మంగళవారం మత పెద్దలు, స్థానిక పెద్దలతో కలిసి కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో షాదీఖానా నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని అధికారులు పరిశీలించగా, భవిష్యత్ నిర్మాణానికి ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నట్లు సాంకేతికంగా గుర్తించారని తెలిపారు. గతంలో ఆ ప్రాంతంలో భద్రకాళి అమ్మవారి మట్టి తీసుకువచ్చి స్థలాన్ని పూడ్చడంతో భవనం నిర్మిస్తే పునాదుల విషయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు సూచించినట్లు వివరించారు.మైనార్టీలకు మెరుగైన వసతులతో షాదీఖానా నిర్మించాలనే ఉద్దేశంతో పాత స్థలానికి ప్రత్యామ్నాయంగా అనువైన స్థలాన్ని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రహదారి సౌకర్యం, స్థల పరిస్థితులు, భవిష్యత్ నిర్మాణానికి అనుకూలత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. మత పెద్దలు, స్థానిక పెద్దలతో కలిసి స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు పేర్కొన్నారు.స్థల మార్పుపై కొందరు రాజకీయ విమర్శలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించకుండా మైనార్టీలను తప్పుదోవ పట్టించడం సరికాదని పేర్కొన్నారు. అందరి ఆమోదంతో, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్థలాన్ని ఎంపిక చేసుకునే అవకాశం మత పెద్దలకు కల్పించినట్లు తెలిపారు.మైనార్టీల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. షాదీఖానా నిర్మాణం పూర్తయితే ముస్లిం మైనార్టీ కుటుంబాలకు వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. తదుపరి చర్యలను అధికారులతో సమన్వయం చేసుకుని వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కాజీపేట దర్గా పీఠాధిపతి కుసురు పాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం చైర్మన్ అజిత్ ఉల్లా, మాజీ కార్పొరేటర్లు అబూబకర్, నసీం జాన్, విజయశ్రీ రాజాలీ, నాయకులు అంకుస్, బాబాయ్, ముజాహిద్, సమీ, మైనార్టీ మత పెద్దలు, స్థానిక నాయకులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డికి సమస్యల వినతిపత్రం సమర్పణ



నిత్యం నిఘా, నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 29

నిజామాబాద్ రూరల్ సిరికొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లెల సాయిచరణ్, ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు రేకులపల్లి భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామాభివృద్ధికి సంబంధించి పలు కీలక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు సిరికొండ గ్రామానికి అదనంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ప్లాట్లను తక్షణమే అర్హులకు పంపిణీ చేసి, వాటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని గ్రామంలో శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు 1,00,000 లీటర్ల (100 KL) మరియు 90,000 లీటర్ల (90 KL) సామర్థ్యం గల రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని పోచమ్మ గుడి నుండి దొండ్లవాగు వరకు రోడ్డుకు ఇరువైపులా సిమెంట్ డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని ట్రాఫిక్ సమస్య నివారణకు సిరికొండ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల మరియు గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయడంతో పాటు, ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ మరియు ఇతర వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్సీ కాలనీలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమం మరియు ఆరోగ్య సేవల కోసం నూతన అంగన్‌వాడీ భవనాన్ని మంజూరు చేయాలని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రీ-ప్రైమరీ పాఠశాలకు అదనపు తరగతి గదులను మంజూరు చేయాలని గ్రామంలో ఇండ్ల మధ్య గుండా వెళ్తున్న ప్రమాదకరమైన 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఊరి బయటకు తరలించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని గత 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సర్వే నంబర్ 532 భూసమస్యను పరిష్కరించి, నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు గ్రామ పాలకవర్గం విన్నవించిన సమస్యలపై ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ఈ సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్యామ శోభన్ వార్డు మెంబర్లు అల్లిపురం కిషన్, ఇందూరి అమృత, చిట్యాల రంజిత్, ఎరుకల ఎల్లయ్య, కొలిపాక అశ్విని, కానపురం సునీత, బాధవత్ తిరుపతి, బోల్గం శివకుమార్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com